# పరిశుభ్రత పాటిద్దాం.. ఆరోగ్యంగా జీవిద్దాం

## పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** పరిశుభ్రత పాటించి.. ఆరోగ్యకరంగా జీవిద్దామని పురపాలక కమిషనర్ లోకేశ్వరవర్మ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన 'దోమలపై దండయాత్ర- పరిసరాల పరిశుభ్రత' కార్యక్రమం జయప్రదానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖాధికారులు, సిబ్బంది, స్వచ్ఛంధ సంస్థలు సహకరించాలని సూచించారు. స్థానిక పురపాలక కార్యాలయంలో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డెంగీ, గన్యా, మలేరియా ఇతరత్రా వ్యాధుల నివారణతో పాటు దోమల పుట్టుక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై పాటించాలని కోరారు. ఈనెల 24వ తేదీ వరకు రోజుకు 6 వార్డుల ప్రకారం పురపాలకలో ఇంటింటికెళ్లి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పురపాలక ఉపాధ్యక్షుడు అమరేంద్ర మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, వైద్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు దేశాది ప్రకాష్, ఇబ్రహీం, మంజుల, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పురపాలక, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు.. మాట్లాడుతున్న పురపాలక కమిషనరు లోకేశ్వరవర్మ



పుంగనూరు.. హాజరైన అధికారులు, సిబ్బంది

## సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యం

**రొంపిచెర్ల, న్యూస్‌టుడే:** సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకర జీవితం పొందగలమని మండల వైద్యాధికారి డాక్టరు యల్లయ్య అన్నారు. స్థానిక ఇందిరాక్రాంతి పథకం కార్యాలయంలో బుధవారం మహిళా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య సూత్రాలు, అంటువ్యాధుల వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా సంతబజారువీధి, చిన్నమసీదు వీధి, శ్రీరాములు గుడివీధి, వారణాసివారిపల్లె తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సాయంత్రం వేళల్లో ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవాలని, రాత్రిల్లో దోమ తెరలు వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రఫీ, సీహెచ్‌వో పద్మావతి, సూపర్‌వైజర్ పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చురుగ్గా పారిశుద్ధ్య పనులు

**దాదేపల్లె(చౌడేపల్లె), న్యూస్‌టుడే:** మండలంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏ.కొత్తకోట, దాదేపల్లెలలో బుధవారం విద్యార్థులు, గ్రామస్థులు పారిశుద్ధ్యం-పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీహెచ్ఎన్ సాంబశివరావు మాట్లాడుతూ.. నివాస గృహాల చుట్టూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడటం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు రాజశేఖర్, మురళీధర్, సూపర్‌వైజరు పురుషోత్తం, ప్రధానోపాధ్యాయుడు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.



చౌడేపల్లె.. ఏ.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

**మంగళంపేట(కల్లూరు), న్యూస్‌టుడే:** గ్రామాల్లో పారిశుద్ధ్య లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి శ్రీధర్, ఎంపీడీవో సౌభాగ్యం పేర్కొన్నారు. మండల కేంద్రం పులిచెర్ల పీహెచ్‌సీ పరిధిలోని పులిచెర్ల, 102ఇ.రామిరెడ్డిగారిపల్లె, దేవళంపేట, మంగళంపేట తదితర గ్రామాల్లో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మురుగునీటి నిల్వలను గుర్తించి అందులో ఫినాయిల్, కిరోసిన్ చల్లారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



చౌడేపల్లె.. పట్టణంలో చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

**చౌడేపల్లె, న్యూస్‌టుడే:** స్థానిక పట్టణ వీధుల్లో బుధవారం అదనపు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్తాచెదారాలు తొలగించారు. పంచాయతీలో సిబ్బంది తక్కువగా ఉండటంతో.. అవసరమైన మేర సిబ్బందిని తాత్కాలికంగా తీసుకుని పనులు చేయిస్తున్నారు. ప్రధానంగా కుమ్మరవీధి, బజారు వీధి, మోటారు వీధి, నాయనవారిపాళ్యం, మేదరుదొడ్డి, గోసులకురప్పల్లె, బత్తలాపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, రామకృష్ణ, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.